# థాంక్యూ

ప్రభాకరం బార్‌లోంచి బయటకొచ్చేడు.

పదిన్నరయింది. రోడ్లపైన సద్దుమణిగింది.

గేటువద్ద నిల్చుని హిచ్‌కాక్ లాంటి ఘూర్కా సెల్యూట్ కొట్టి చెయ్యిచూపేరు–

మామూలుగా ప్రభాకరానికి ఇలాంటి ఫార్మాలిటీస్ గిట్టవు. ఇళ్లవద్ద పండగ మామూళ్లు, హోటల్స్‌లో టిప్పులు– జస్ట్ నాన్ సెన్స్ అంటాడు. కాని మూడు పెగ్గుల విస్కీ సమేతుడై వున్నాడేమో గుండె పొంగి కర్ణుడి హృదయమంత విశాలమైంది.

జేబులోకి చెయ్యి సర్రున పోనిచ్చి, మళ్ళీ దాన్ని బర్రున బయటకు తెచ్చి చేతికందిన వాటినన్నిటినీ హిచ్‌కాక్ చేతిలో కుమ్మరించేడు.

అతడు మళ్లీ గట్టిగా సెల్యూట్ కొట్టేరు.

'జీతేరహో– మగర్ హమ్ ఫిర్ ఆతే నహీ' అని సైగల్లాగా విషాదప్పోట పాడానుకుని ఎందుకులెమ్మని సర్దిచెప్పుకుని ముందుకు ప్రొసీడయ్యాడు.

ప్రభాకరం నిత్య ఆల్కహాలీకుడు కాదు. ఆర్నెల్లకోసారి– అదీ ఏదైనా సజావైన కారణం సందర్భం వుంటేనే, తనికెళ్లయినపుడు ఒకసారి, తండ్రయినప్పుడు ఒకసారి రెండుసార్లు మాత్రమే స్నేహితులకి బీర్ పార్టీ ఇచ్చేడు. ఈ రెండుసార్లు తాగొచ్చినందుకు కామాక్షి ఇప్పటికీ ఏదైనా చెప్పి చెయ్యకపోతే. ఆవున్లెండి– తాగుబోతు వాడి మాటలు నమ్మటం నా బుద్ధి తక్కువ అనుకుని మరీ బాధపడిపోతుంది.

కామాక్షికి, ఆల్కహాలుకి పచ్చగడ్డి పడేస్తే బగ్గుమనేటంత వైరంవుంది.

స్నేహితుల బలవంతంపైన కాదన్లేక ముచ్చటగా మూడోసారి మూడు పెగ్గుల విస్కీ తాగేశాడు.

కానీ చిత్రం.

బార్లోకి వెళ్లేటప్పుడు కామాక్షిని తల్చుకుని కాస్త జంకిన మాట నిజం. కాని ఇప్పుడు అసలు భయం లేదు. పైగా పులిచేత కాళ్లు పట్టించుకున్నంత ధైర్యంగా, హేపీగా, ఎక్స్‌ట్రాగా వుంది.

ప్రభాకరం మెట్లు దిగి ప్రక్క సందులోవున్న స్కూటర్ పార్కింగ్ వైపుగా వెళ్లాడు.

వరుసగా వున్నయ్ రకరకాల వాహనాలు.

ప్రభాకరం కళ్లు పెద్దవి చేసుకుని తన వాహనం కోసం చూపులతోనే వెతికాడు.

కంటపడ్డ వాహనాన్ని చూసి 'అదిగో అల్లదిగో ప్రభాకర రథమూ' అంటూ అన్నమాచార్య గీతంలాంటిది పాడాలనుకుని ఎందుకులెమ్మని మళ్లీ రాజీపడి నాలుగడుగులేసి స్కూటర్ వద్ద కెళ్లాడు.

హేండీలు పైన చెయ్యి మోపంగానే ఎడం వైపుగా చూస్తున్నదల్లా తెలుగు సినిమా తండ్రిలాగా కుడివైపుకి తలవాల్చేసింది.

తను లాక్ చెయ్యడం మర్చిపోయాడు!

ఓ మైగాడ్! తన అదృష్టం గొప్పది కామాక్షి శీలం గొప్పది... కాని వెంటనే స్కూటర్‌కి శీలానికి ఏమిటి సంబంధం అనిపించింది. తనలో తాను నవ్వుకున్నాడు.

కష్టార్జితం కనుకనే తాళం వేయకపోయినా పెళ్లాంలాగా ఓపిగ్గా పడుంది అనుకుని కష్టారిజతమనగా నీవు నీ వాహనమును తాళించకుండా పానశాలలో జొరబడి గంటల కొలదీ చెడతాగి బయటకొచ్చేసరికి నీ వాహనం యథాస్థానంలో ఉన్న ఎడల అది కష్టార్జితము లేనియెడల అది సుఖార్జితము– అని గొంతెత్తి చాటాలని అటూ ఇటూ చూశాడు.

సరిగ్గా పది గజాల అవతల ఇంకో వ్యక్తి కంటపడ్డాడు అతగాడు నిల్చున్నాడో, కూర్చున్నాడో చెప్పడం కష్టం. ఏదో కొత్త ప్రక్రియ చేసి చూపిస్తున్నాడు.

పహారీవైపునుంచి శరీరాన్ని మాత్రం భూమ్మీద జారవిడిచేడు. కాని కళ్లు మాత్రం పత్తికాయల్లాగా తెరకునేవున్నాయ్. పైగా తన వైపుగానే చూస్తుండటం గమనించి ప్రభాకరం కొద్దిగా కంగారుపడి తర్వాత జాలిపడ్డాడు. అడ్రసు మర్చిపోవడమో, అర్ధాంగిని తల్చుకుని భయపడటమో, ఏదో ఒకే ఒక కారణంగా ఈ విధంగా గోడపైన జీవితాన్ని తెల్లవార్చుకుంటున్నాడని అనుకుని జాలిపడి, హేండీల్నిమళ్లీ అటూ ఇటూ తిప్పి కిక్కిచ్చిడు.

స్టార్ట్ కాలేదు.

మళ్లీ బలంగా కిక్ కొట్టాడు. వుహూ స్టార్ట్ కాలేదు. మళ్లీ...మళ్లీ... అయినా స్టార్ట్కాలేదు.

ప్రభాకారానికి వొళ్లు మండిపోయింది.

అటువైపుగా వెళుతున్న ఆసామిని పిల్చి నీళ్లూ, నువ్వులూ తెచ్చుకోండి దీన్ని దానం చేస్తాననవి చెప్పెయ్యాలన్నంత కోపం వచ్చింది. తమాయించుకున్నాడు. తాగిన వెధవలంటే పెళ్లాలకే కాకుండా స్కూటర్లగూడా చిన్న చూపే కాబోలనుకుంటా తలతిప్పి ఆ వ్యక్తి వైపుగా చూసేడు అతడేమాత్రం కదలిక లేకుండా ప్రహారీ పైన పవళించి అదే పనిగా తనవైపే చూస్తున్నాడు.

ప్రభాకరానికి మళ్లీ అతడ్ని చూడంగానే కడుపు తరుక్కుపోయింది. ఏ సీకాసదన్వాళ్ళో, ఏ మానవతా వాదులో ఓ ఆటో పిల్చి ఇతగాడ్ని అందులోకి రవాణా చేస్తే బాగుండునని మనస్ఫూర్తిగా అనుకుని ఆ ప్రయత్నంగానే మళ్లీ ఓ కిక్కిచ్చాడు.

అయిని స్టార్ట్ కాలేదు.

ఈసారి నిజంగా కోపం రావడంతో చిటుక్కున కూర్చుండిపోయి ఇంజన్వైపు డోమ్ని విప్పదీశాడు.

ప్లగ్ పిన్ని బయటికి తీసి మసక వెలుగులో పరీక్షగా చూసేడు.

అంతా మట్టి దట్టంగా నిండుగా.

ఇంత మట్టిని దాని నోట్లో కుక్కిస్టార్ట్ కమ్మంటే అవుతుంద! పోటీపడి జేబులోంచి కర్చీఫ్ తీసి శుభ్రంగా తుడిచేడు. ప్లగ్ని తిరిగి యథాస్థానంలో బిగించాడు.

ఎలాగూ చేతులకి మసైంది కాబట్టి ఎన్నాళ్లగానో అనుకుంటున్న చిన్న చిన్న పన్లు గూడా పూర్తి చేసేస్తే బావుంటుందని టూల్ బాక్స్ తెరిచి పనిముట్లని బయటకి తెచ్చి వెనుకచక్రం నట్లన్నీటినీ బిగించేడు.

అంతా పావుగంటలో అయిపోయింది.

హమ్మయ్య అనుకున్నాడు.

ఉదయం పూట టైమ్ వుండదు. సాయంత్రాల్లో గుర్తుండదు.

ఫలితంగా దుమ్ము ధూళి పేరుకపోయాయ్.

ప్రభాకరం సామాన్లన్నిటినీ టూల్ బాక్స్లో పడేసి క్లోజ్ జేసేడు. ఫ్రేమ్ని యధాస్థానంలో బిగించేడు.

సరిగ్గా అప్పుడు అనుమానం వచ్చింది. బాగుపడ్డట్లేనా?

బలంగా కిక్కు కొట్టాడు... స్టార్టయింది.

ఇంజన్ని ఆఫ్ చేసేసి చేతుల్ని శుభ్రంగా తుడుచుకుంటూ మళ్లీ ఆ వ్యక్తి వైపుగా చూసేడు.

ఇప్పుడతను గోడపైని వ్రేలాడటం లేదు. భూమ్మీద నిల్చున్నాడు. పైగా కదిలి తనవైపుగానే రావటం గమనించి తుక్కుమన్నాడు ప్రభాకరం.

కొంపదీసి లిఫ్టుగానీ అడుగుతాడా, అలా అయితే ఏం చెప్పాలా అని ఆలోచిస్తూండగానే ఆ వ్యక్తి బాగా దగ్గరగా వచ్చి నిల్చున్నాడు.

ప్రభాకరాన్ని పరీక్షగా చూసేడు కాస్సేపు.

ఆ పైన చిన్నగా నవ్వుతూ ఇందాకట్నించి మీ చూపుల్ని నేనర్థం చేసుకున్నాను. ఎక్కువగా తాగేసి వెళ్ళలేక ఆ గోడపైన వ్రేలాడుతున్నానని మీ భావన. కాని నే తాగలేదు. తాగను కూడా. అలవాటులేదు. ఇకపోతే ఎందుకలా ఆ గోడవద్ద నిల్చుండిపోయావని మీరడగోచ్చు స్కూటర్ ట్రబుల్ స్టార్ట్కాక గంటసేపు దానితో కుస్తీ పట్టి అలసిపోయి ఆ విధంగా వుండిపోయేను.

సమయానికి దేవుడిలాగా వచ్చి అడక్కుండా రిపేరు చేసిపెట్టారు. థాంక్స్...

ప్రభాకరం వులిక్కిపడి రెండడుగులు వెనక్కేసి నంబర్ ప్లేట్ చూసేడు. ఆ స్కూటర్ అతడిది కాదు..